క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో రామేశ్వర స్వామి

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె గ్రామంలో నూతనంగా పునః నిర్మించిన రామేశ్వర ఆలయంలో బుధవారం అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. ఆలయంలో రామేశ్వర పార్వతీ పరమేశ్వరులు, గణపతి, నాగదేవతలు, ధ్వజ శిఖర నవగ్రహ చౌడేశ్వరి దేవి పరివార దేవతామూర్తుల విగ్రహాలను దేవపండితులు ప్రతిష్ట చేశారు. అనంతరం భక్తులు స్వాములకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మహేశ్వర రెడ్డి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు.

సబ్సిడీతో పశువుల దాణా

చాపాడు: మండలంలోని పాడి రైతులకు 50శాతం సబ్సిడీతో పశువుల దాణా ఇస్తామని మండల పశు వైద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. మండలానికి 7 టన్నుల దాణా మంజూరైందని ఇందులో 2.5 టన్నుల చొప్పున చాపాడు, చిన్నగురువళూరు, 2 టన్నులు వెదురూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు దిగుబడి అయిందన్నారు. దాణా కావాల్సిన రైతులకు ఒక్కో రైతుకు 50శాతం సబ్సిడీతో 50కిలోల ఒక్కో బ్యాగు రూ.555 ఇస్తామని తెలపారు. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

కలసపాడు : ప్రైవేటు పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు పొందడానికి మే 2వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓలు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయలో ఎంపీడీఓ మహబూబ్‌బీ కరపత్రాలను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి 5 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 14 శాతం, బలహీన వర్గాలు, మైనార్టీలకు 6 శాతం మొత్తం కలిపి 25 శాతం సీట్లు కేటాయించారని తెలిపారు. సీఆర్‌పీలు విజయ కుమార్, చెంద్రాయుడు,ఓబయ్యపాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అవసరం

బద్వేలు అర్బన్ : వేసవి ఎండల ఉష్ణోగ్రతల నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు అవసరమని, అందుకు దాతలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు ముందుకు రావాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డికోరారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎన్‌జీవో కాలనీ వద్ద రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు గంగసానిసాంబశివారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని తిరువెంగళాపురం గ్రామంలో బుధవారం జరిగిన తిరువెంగళాపురం సర్పంచ్ సుబ్బనరసింహ మేనల్లుడి వివాహ మహోత్సవానికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు హాజరై నూతన వధూవరులు అశోక్, సుకన్యను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, పుత్తాశ్రీరాములు, కుప్పాల శ్రీరాములు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ ప్రాంతంలో బుధవారం సాయంత్రం నుంచి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ ప్రభావానికి అక్కడక్కడ చెట్లు ఒరిగిపోయాయి. విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. రాత్రి సమయానికి పట్టణంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అందలేదు. పరిస్థితి గమనించి ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నామని హౌసింగ్ బోర్డు ఐడీఏ ఫీడర్ల కింద విద్యుత్ సరఫరాలో ఆలస్యం జరుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ రమణారెడ్డి తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

రాజుపాళెం : ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. అయితే మండలంలోని అర్కటవేములలోని యాదవ వీధిలో తుమ్మచెట్టుపై పిడుగు పడింది. ఆ సమయంలో చెట్టుకింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. అక్కడ గడ్డి వాములు ఉండటంతో మంటలను కొంతమంది ఆర్పివేశారు. చెట్టుపై మండుతున్న మంటలను చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

వ్యర్థాల దహనం.. అనర్థదాయకం

- పంట వ్యర్థాలను కాల్చివేస్తున్న రైతులు
- సారం కోల్పోతున్న భూమి
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



పంట వ్యర్థాలకు నిప్పు పెట్టిన రైతులు

కలసపాడు : ఖరీఫ్, రబీ సాగు ఏదైనా పంట పూర్తయిన తర్వాత ఆవశేషాలను దహనం చేయడం రైతులకు అలవాటుగా మారింది. ఇలా చేయడం వలన అగ్నిప్రమాదాలు సంభవించడంతో పాటు భూమిలో అనేక మార్పులు జరిగి భూమి సారం కోల్పోయే ప్రమాదముంది. ఫలితంగా పంట దిగుబడులు తగ్గిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీనికి బదులుగా ఆవశేషాలను భూమిలో కలియ దున్నడం వలన భూమి సారం పెరిగి తదుపర పంటలో అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

బద్వేలు నియోజకవర్గంలో ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న, సజ్జ, పొగాకు, మిరప, కంది, ఆముదం పంటలను రైతులు సాగు చేస్తుంటారు. సుమారు 90 శాతం మంది రైతులు గత పంటల ఆవశేషాలను కాల్చివేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సజ్జ, వరి, మొక్కజొన్న, పొగాకు పంటలు పూర్తి కావడంతో పంటల ఆవశేషాలను యదేచ్ఛగా దహనం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు గతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, పోరుమామిళ్ల, అట్లూరు, గోపవరం, బద్వేలు మండలాల్లో సుమారు 50 వేల హెక్టార్లలో ఖరీఫ్, రబీ సీజన్ల సాగు ప్రస్తుతం పూర్తయింది. కొంత మేర రబీలో వరి, ఆముదం, మినుము పంటలు సాగు చేయగా పూర్తయిన రైతులు పంటల ఆవశేషాలను సాగు భూముల్లోనే కాల్చివేసి వచ్చే ఏడాది ఖరీఫ్ పంటకు భూమిని సిద్ధం చేసుకుంటున్నారు.

కలియదున్నితే మేలు

పంటల ఆవశేషాలను భూమిలో కలియదున్నడం వలన సేంద్రియ కర్బనం పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పూర్వం రైతులు పంట ఆవశేషాలను భూమిలో కలియదున్నేవారు. దీని ఫలితంగా అవి కుళ్ళిపోయి తర్వాతి పంటలకు మంచి ఎరువుగా మారేవి. కాలక్రమేనా రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి పొలంలోనే తగలపెట్టడం అలవాటుగా మార్చుకున్నారు. దీని వలన రైతులకు తెలియకుండానే భూమికి అనేక విధాల నష్టం కలుగుతుంది. నిప్పు పెట్టడం వలన తర్వాత సాగు చేయబోయే పంటలకు నష్టం వాటిల్లడమే కాకుండా వాతావరణ కాలుష్యం, అగ్ని ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఇటీవల ఈ తరహా ఘటనలు అధికమవుతున్నాయి.

పంటల వ్యర్థాలను కాల్చడం వలన తలెత్తే అనర్థాలు

- నేలస్వాభావిత లక్షణాలు మారిపోతాయి.
- భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది.
- భూసారం తగ్గి పరోక్షంగా దిగుబడులపై ప్రభావం.
- నేలలో తేమశాతం గణనీయంగా తగ్గుతుంది.
- నేలలో ఆమ్లగుణం తగ్గిపోతుంది.
- పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది.
- అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాల్సి వస్తుంది.
- ఫలితంగా నేల సమతుల్యత దెబ్బతింటుంది.
- భూమి పొరల్లో పంటకు, నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోతాయి.

కలియదున్నడం ఉత్తమం



పంటల ఆవశేషాలను రైతులు భూమిలో కలియదున్నాలి. ఆవశేషాలు కుళ్లిపోయి ఆ తర్వాత సాగు చేసే పంటకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుల వలన భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు లభిస్తాయి. దీని వలన ఎరువుల వాడకం,పెట్టుబడులు తగ్గుతాయి. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

–జాకీర్‌షరీఫ్, మండల వ్యవసాయాధికారి, కలసపాడు

పుస్తక పఠనంతో మేధో వికాసం



అట్లూరు: పాటలు పాడుతున్న విద్యార్థులు



పోరుమామిళ్ల: మాట్లాడుతున్న దేవదత్తం

అట్లూరు: విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం జీవితాంతం వారి వెంటే ఉండి వారి భావి జీవితాన్ని తేజోవంతం చేస్తుందని, గ్రంథాలయాధికారి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, వేమన పద్యాలు విద్యార్థులతో కంటస్థం చేయించారు. అలాగే భగవద్గీత శ్లోకాలు పలికించడంతో పాటు నృత్యాలు, ఆట, పాటలు కూడా ఆడించి పాడించారు.

పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదు

పోరుమామిళ్ల: సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనాన్ని మించిన మార్గం లేదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు దేవదత్తం పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపుకు ముఖ్య అతిథి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని అన్నారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలకు రిసోర్స్ పర్సన్స్ ద్వారా వేసవి వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ వల్ల నష్టాలు, పుస్తకం పఠనం వల్ల లాభాలను వివరించారు. గ్రంథాలయ అధికారి అఫ్రిది, ఉపాధ్యాయులు ఇన్నయ్య, తెలుగు లెక్చరర్ మహమ్మద్‌రఫీ, జేవీవీ నాయకులు గీతాలు ఆలపించి పిల్లలను ఉత్సాహ పరచారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు



అట్లూరు: బోవిళ్ల నరసింహారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



బద్వేలు అర్బన్ : కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బోవిళ్ల నరసింహారెడ్డిని బుధవారం ఆకుతోటపల్లికి వెళ్లి ఆయన నివాసంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వెస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరి పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోవిళ్ల చిన్నసూరారెడ్డి, పెంచల్‌రెడ్డి, నాగిరెడ్డి రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : ఇటీవల గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 32వ వార్డు కౌన్సిలర్ బండి చెన్నయ్యను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు అన్ని జాగ్రత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, కౌన్సిలర్లు ధనలక్ష్మి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మే డే వేడుకలు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ పార్కు వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మే డే సందర్భంగా కార్మిక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరిస్తామని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపు ఉచిత ఉపనయనములు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జగద్గురు ఆదిశంకారచార్యుల జయంతి సందర్భంగా కడప జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉచిత ఉపనయనములు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చక సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.56 గంటలకు ఉచిత సామూహిక ఉపనయనములు నిర్వహిస్తామని, గురువారం సాయంత్రం 6 గంటలకు వటువునకు నాంది, పెండ్లికొడుకు చేసుకొని అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకోవాలని వారు సూచించారు.

వెలుగు యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల: మండలంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వెలుగు యానిమేటర్లపై ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో రూ. 40 లక్షలు దుర్వినియోగం చేస్తే ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవని ఆయన అన్నారు. డ్వాక్రా సంఘాలకు లోన్లు మంజూరు చేయడంలో తేడాలు చూపిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ప్రసాదరావు పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి యానిమేటర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

తవ్వకాలను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



మోటుగుట్టపై తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లె వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం జరిపిన మట్టి తవ్వకాలను బుధవారం రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, సహాయ జియాలజిస్ట్ కృష్ణమూర్తి తదితరులు గడ్డమాయపల్లె వద్ద ఉన్న మోటు గుట్టపై కాంట్రాక్టర్ ఎంత మేరకు తవ్వారు అనే దానిపై దానిని నిర్ధారించేందుకు కొలతలు తీసుకున్నారు. దువ్వూరు మండలం చింతకుంట వద్ద అనుమతి తీసుకుని సదరు కాంట్రాక్టర్ గడ్డమాయపల్లె వద్ద సర్వే నంబర్ 83లో అక్రమంగా మట్టిని తవ్వుతున్నారని గ్రామానికి ఎందిన తప్పెట శశిధర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఈనెల 23న విజిలెన్స్ అధికారులు మోటుగట్టును పరిశీలించారు. బుధవారం మట్టి తవ్వకాలు ఎంత మేరకు చేశారనే దానిపై కొలతలు తీశారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపుతామని అధికారులు పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



నాగమణి దంపతులును సన్మానిస్తున్న వైద్యాధికారులు

బి.కోడూరు : విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌కిరణ్ అన్నారు. బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ అధికారిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన నాగమణిని బుధవారం వైద్యాధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా సీహెచ్‌ఓగా నాగమణి చేసిన సేవలను వారు కొనియాడారు. విజయవాడ నుండి బి.కోడూరు పీహెచ్‌సీకి వచ్చి అందరితో కలిసిమెలిసి స్థానికంగా ఉంటూ ఆమె చాలా బాధ్యతగా మంచిగా ఉద్యోగం నిర్వర్తించారని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తదితరులు

రాజుపాళెం : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. మండలంలోని గోపాయపల్లె గ్రామంలో నూతనంగా పునః ప్రతిష్ఠించిన రామేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వైఎస్ అవినాష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మాజీ రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రా రెడ్డి, ఎంపీపీలు కానాల జయచంద్రా రెడ్డి, సానబోయిన శేఖర్ యాదవ్, మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్ రెడ్డి, చంద్రావతమ్మ ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు జీరెడ్డి అంజనీ కుమారి, సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్ రెడ్డి ఆహ్వానం మేరకు వారు వచ్చారు. ఆలయంలోకి వారు రాగానే అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పూజలు చేశాక అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ పెద్దలు వారికి పూలమాల వేసి శాలువ కప్పారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గుద్దేటి రాజారాం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాణా వెంకట కొండారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్‌లు పట్టాబి సీతారామి రెడ్డి, జనార్ధన్ రెడ్డి పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిది



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిదని, 41 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ వృత్తికే సింగన ఓబుల్‌రెడ్డి వన్నెతెచ్చారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కావెంకటేశ్వర్లు కొనియాడారు. స్థానిక కోటిరెడ్డినగర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఓబుల్‌రెడ్డి సన్మానసభను బుధవారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వృత్తిపట్ల అంకితభావం, సమయపాలన, క్రమశిక్షణ ఓబుల్‌రెడ్డికే సొంతమన్నారు. ఇటు ఉపాధ్యాయుడుగా అటు ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా సమన్వయంతో ముందుకు సాగుతూ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలోనూ, ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించడంలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. అనంతరం ఓబుల్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్షుడు మాదనవి జయకుమార్, ఎస్టీయూ జిల్లా నాయకుడు నరసింహారెడ్డి, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రవిశంకర్, మండల విద్యాశాఖాధికారులు రఘురామిరెడ్డి, చెన్నయ్య, సునీల్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు, గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సభాధ్యక్షుడు రవికుమార్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటసుబ్బారెడ్డి, ఆపస్ జిల్లా నాయకుడు సుబ్బరాయుడు, విశ్రాంత ఎంఈఓలు గంగన్న, రామచంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వరలక్ష్మి

దువ్వూరు : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్క రూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి కోరారు. దువ్వూరులో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18 ఏళ్లు పూర్తికాకుండా వివాహం చేయడం నేరమని తెలిపారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల అమ్మాయిలకు కలిగే నష్టాలను, ప్రసవ సమయంలో ఎదుర్కొనే సమస్యలను వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహ నిరోధక చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించారు. పూజారులు, ఫొటోగ్రాఫర్లు, సప్‌లైర్స్, ముస్లిం మత పెద్దలు, పాస్టర్లు బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. మే 2 నుండి జూన్ 10వ తేదీ వరకు కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి శ్వేత, ముస్లిం మత పెద్దలు గౌస్‌లాజం, పూజారి నరసింహాచారి, ఫొటోగ్రాఫర్ గౌస్, అంగన్‌వాడీ కార్యకర్తలు అయేషా, ప్రసన్నకుమారి, సునీత, కవిత, సుభద్ర, కుమారి, ఆశా వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని నజిరుల్లా షా సాహెబ్ దర్గా స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దర్గా డీవోటీస్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ అహ్మద్, కార్యదర్శి షేక్ సలీం బాషా పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దర్గా స్థలంలో అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో రిట్ పిటీషన్ వేశామని దీనితో హైకోర్టు ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు తీర్పు వచ్చే వరకు ఎవ్వరు ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశించిందన్నారు. అయితే హైకోర్టు తీర్పును కాదని అక్రమ నిర్మాణాలను కొనసాగుతున్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, దర్గా స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని కమిషనర్ ఆదేశించారన్నారు. అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్న వారిపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ కోశాధికారి షేక్ అబ్దుల్ ఖాదర్, సభ్యులు బాబా ఫకృద్దీన్, ట్రస్టీ సయ్యద్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

బీవీఎస్ థియేటర్ వద్ద పెచ్చుల తొలగింపు

ప్రొద్దుటూరు : స్థానిక బీవీఎస్ థియేటర్ వద్ద ఉన్న మూడు అంతస్తుల భవనానికి సంబంధించిన పెచ్చులను ప్రత్యేక సిబ్బందితో బుధవారం రాత్రి తొలగింపు పనులు చేపట్టారు. ఉదయం నుంచి భవనానికి సంబంధించిన పెచ్చులూడి కింద పడటంతో ఆ ప్రాంత ప్రజలు, వ్యాపారులు భయాందోళన చెందారు. సాయంత్రం పెద్ద ఎత్తున గాలులు వీచిన కారణంగా శ్లాబుకు సంబంధించిన పెచ్చులు పై నుంచి ఎక్కువగా కింద పడ్డాయి. ఈ విషయంపై వెంటనే బీవీఎస్ హాల్ యాజమాన్యం పోలీసుల సహాయంచే మెయిన్ రోడ్డుపై బారీకేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. ప్రత్యేక సిబ్బందితో శిథిలావస్థలో ఉన్న కట్టడాలను తొలగించారు. ముందు జాగ్రత్తగా కింద ఉన్న షాపుల వారు తమ షాపులను మూసివేశారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం!

- అక్రమంగా వెలసిన గుడిసెలు
- గుడిసెల తొలగింపులో అధికారులు విఫలం
- కోర్టును ఆశ్రయించిన గుడిసెవాసులు
- లబోదిబోమంటున్న పట్టాలు పొందిన లబ్ధిదారులు



జగన్నకాలనీలో అక్రమంగా వేసిన గుడిసెలు

గోపవరం : మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని పి.పి.కుంటలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారి పక్కనే 1,562 సర్వే నంబరులో గత ప్రభుత్వం జగనన్న కాలనీని ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి విడతలో 12 మంది లబ్ధిదారులకు అప్పట్లోనే ఇళ్లు నిర్మించారు. రెండవ విడతలో 71 మందికి పట్టాలు పంపిణీ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా గత ప్రభుత్వంలోనే జరిగింది. పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు చూపించేలోపు ఎన్నికల కోడ్ రావడంతో స్థలాలు కేటాయించే కార్యక్రమం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టాలు పొందిన లబ్ధిదారులు స్థలాలు చూపించాలని స్థానిక రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగారు. అంతేకాకుండా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో కూడా అర్జీలు అందజేశారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సీపీఐ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో అక్రమంగా గుడిసెలు వేయించారు. అడ్డుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహించారు. లబ్ధిదారులు మాత్రం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. జగనన్న కాలనీలో వేసిన అక్రమ గుడిసెలను తొలగించి పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అనేకమార్లు తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూడా ఎలాంటి చర్యలు లేవు. గత మండల సర్వసభ్య సమావేశంలో స్వయంగా తహసీల్దారు త్రిభువన్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలో వేసిన గుడిసెలను తొలగించి వచ్చే సమావేశంలోపు పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు చూపిస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. తిరిగి ఏప్రిల్ 28న సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి తహసీల్దారు హాజరుకాలేదు. అయినా గుడిసెలు తొలగించే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ఇంతలో అక్రమంగా వేసిన గుడిసెవాసులు హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా కోర్టును ఆశ్రయించారు. తాము నిరుపేదలమని, తమకు ఇళ్లస్థలాలు ఎక్కడా లేవని కోర్టుకు తెలపడంతో ఆ స్థలంలో అధికారులు ఎవరూ దిగవద్దని, యథాస్థితిగా ఉండాలని న్యాయస్థానం స్టే ఇచ్చింది. ఇప్పుడు రెవెన్యూ అధికారులు చేతులు కాలాక ఆకులను పట్టుకున్న చందంగా పట్టాలు పొందిన 71 మంది లబ్ధిదారులను పిలిపించి ఎలాంటి ఆధారాలు లేకుండా గుడిసెవాసులు కోర్టుకు వెళ్లినప్పుడు పట్టాలు ఉండి మీరెందుకు కోర్టుకు వెళ్లకూడదని లబ్ధిదారులకు ఉచిత సలహాలు ఇస్తున్నారు. కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు సకాలంలో స్థలాలు కేటాయించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని, గుడిసెలు వేసేటప్పుడే రెవెన్యూ, పోలీసులు అధికారులు అడ్డుకుని ఉంటే తమకు ఈ పరిస్థితి వచ్చేది కాదని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేసి పట్టాలు ఇచ్చినప్పటికీ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్థలాలు చూపించడంలో ఇంత నిర్లక్ష్యమా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. స్వయంగా జిల్లా కలెక్టరే గుడిసెలు తొలగించి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని తహసీల్దారుకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి ఏమంటున్నారంటే జగనన్నకాలనీలో అక్రమంగా వేసిన గుడిసెలు తొలగించేందుకు తగినంత పోలీసు ప్రొటెక్షన్ కావాలని మైదుకూరు డీఎస్పీకి ఒకటికి రెండు సార్లు లేఖ రాశామని, వారి నుండి ఎలాంటి స్పందన రాలేదన్నారు. అక్రమంగా వేసిన గుడిసెవాసులు కోర్టును ఆశ్రయించడంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు.